క్లుప్తంగా

పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకుంటున్న ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు

కొయ్యలగూడెం: పంద్రాగస్టు పర్వదినాన్ని పురస్కరించుకొని 555 మంది విద్యార్థులతో నృత్య ప్రదర్శన రూపంలో వేడుకలను నిర్వహించినందుకుగాను తానా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లలో చోటు లభించిందని వెంకటపతి రాజు ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఎస్ఆర్ఆర్ సుభద్రదేవి, కరస్పాండెంట్ నరసింహరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ పాశం నాగమణి, ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని తానా కోఆర్డినేటర్ కె.నాగేంద్రబాబు, భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి శ్యామ్ జాదూగర్ అందజేసిన అవార్డు పురస్కారాలను సుభద్రదేవి, నరసింహారాజులకు అందజేసి అభినందించారు.

భారీ వర్షంతో ఉపశమనం



భీమడోలులో కురిసిన వర్షానికి ఉన్నత పాఠశాల గ్రౌండ్ ప్రాంగణమంతా తడిసి ముద్దయిన దృశ్యం

భీమడోలు: నెల రోజులుగా వర్షాలు లేక రైతులు, ఉక్కపోత వాతావరణంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. బుధవారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీచాయి. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. అనంతరం భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షాలు రాక ఆలస్యమవ్వడంతో రైతులు వరుణుడి కోసం ఎదురు చేశారు. కొన్ని రోజులుగా వేసవి తాపంతో ప్రజలు అల్లాడుతున్నారు. మండల వ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. వాతావరణ శాఖ మరికొన్ని రోజులు పాటు వర్షాలు కురుస్తాయని ప్రకటించడంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

వేళంగిణి మాత ఉత్సవాల్లో దివ్య పూజాబలి

దెందులూరు: వేగవరంలోని ఆర్‌సీఎం చర్చిలో బుధవారం వేళంగిణి మాత ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో స్థానిక ఫారీస్ క్రిస్ట్ ఫాదర్ మోజెస్, సంఘ పెద్దలు, సంఘస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఫాదర్ మోజెస్ దివ్య పూజాబలి అర్పించారు. ఉత్సవాలకు కొత్తపల్లి, మసీదుపాడు, వేగవరం, గోపన్నపాలెం, చల్లపల్లి,సోమవరప్పాడు ఇతర గ్రామాల నుంచి భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు.


రూ.3.50 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు



పోతునూరు-కేదవరం రహదారి నిర్మిస్తున్న దృశ్యం

దెందులూరు: పోతునూరు నుంచి కేదవరం వరకు రూ.3.50 కోట్లతో నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దోసపాడు, ఉండ్రాజవరం, కేదవరం, పోతునూరు, కొవ్వలి గ్రామస్తుల ప్రయాణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి రూ. 3.50 కోట్లతో నిధులు మంజూరు చేయడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నిర్మాణ పనులను పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ డీఎస్‌వీ ప్రసాద్ (బజ్జీ), పార్టీ నాయకులు రమేష్, బీశెట్టి నూకరాజు, బుద్దా అర్జున పరిశీలించారు.

పర్యావరణ పరిరక్షణకు సాల్వేషన్ ఆర్మీ వితరణ



దెందులూరులో మొక్కలు పంపిణీ చేస్తున్న సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్లు రమణయ్య

దెందులూరు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సాల్వేషన్ ఆర్మీ దెందులూరు కోర్ ఆఫీసర్ మేజర్ రమణయ్య అన్నారు. బుధవారం సాల్వేషన్ ఆర్మీ సేవా కార్యక్రమాల్లో భాగంగా గృహసమితి సభ్యులు, పాఠశాల టీచర్లు, సంఘస్తులకు వివిధ రకాల మొక్కలను అందజేశారు. టీచర్లు, గృహసమితి సభ్యులు పర్యావరణ పరిరక్షణ, మొక్కలు పరిరక్షణపై విస్తృతంగా ఇంటింటా అవగాహన కల్పించాలని కోర్ ఆఫీసర్ రమణయ్య కోరారు.

ఏజెన్సీలో కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ, సత్యభామల వేషధారణలో ఉన్న చిన్నారులతో ఎమ్మెల్యే బాలరాజు



కొయ్యలగూడెంలో ఉట్టి కొట్టేందుకు ఉత్సాహం చూపుతున్న కళాశాల యువతీ

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని దొరమామిడి, బుట్టాయగూడెంలోని కొత్తపేటలో ఉన్న రాధాకృష్ణుల ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీకృష్ణుడు, సత్యభామల వేషధారణలో చిన్నారులు అందరినీ మైమరపించారు. దుద్దుకూరులో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొన్నారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో ఉన్న చిన్నారులతో కలిసి సందడి చేశారు.

కొయ్యలగూడెం: కృష్ణాష్టమి వేడుకలు బుధవారం సాయంత్రం నుంచి మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. వివిధ పంచాంగాలలో బుధ, గురు వారాలలో అష్టమి ఘడియలు ఉండడం వల్ల రెండు రోజులు వేడుకలు నిర్వహించడానికి ఆలయాల వద్ద నిర్వాహకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. కన్నాపురం, బయ్యనగూడెం, కొయ్యలగూడెంలోని పలు ప్రాంతాలలో ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వీఎస్ఎన్ కళాశాల వద్ద యువత ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కొయ్యలగూడెంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు.

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అందులో భాగంగా తిమ్మాపురం, తిరుమలంపాలెం, దొరసానిపాడు, వేంపాడు తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున భక్తులు శ్రీకృష్ణునికి పూజలు నిర్వహించారు. అనంతరం యువకులు ఉత్సాహంగా ఉట్లు కొట్టారు. అందులో భాగంగా వేంపాడులో జరిగిన ఉట్ల వేడుకలో బుసనబోయిన వంశీ యువకులకు ఉట్టిని అందించారు.

నేడు పారిజాతగిరిలో...

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో 7వ తేదీ గురువారం సాయంత్రం ఐదు గంటల నుంచి శ్రీకృష్ణుని జన్మనక్షత్ర సందర్భముగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ పెరుమాల్‌కు విశేష అర్చనలు అనంతరం ఉట్టి వేడుక, అభినయ కూచిపూడి నాట్య అకాడమీ రూపాదేవి బృందంచే విశేష నృత్య ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

స్థానిక వేణుగోపాలస్వామి వారి ఆలయంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు స్వామివార్లకు పంచామృత అభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ తదనంతరం వివిధ పూజా కార్యక్రమమాలు జరపబడునన్నారు. రాత్రి 8.30 గంటలకు ఉట్టి కోట్టే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ పూజా కార్యక్రమములు దేవస్థాన అర్చక స్వామి లక్ష్మణాచార్యులుగారి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, భక్తులు వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నగరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



విశేష అలంకరణలో శ్రీరాధాకృష్ణ భగవానుడు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని గోసంరక్షణ సమితి ప్రాంగణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవ, అనంతరం శ్రీ రాధాకృష్ణ భగవానునికి క్షీరాభిషేకం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం నగరంలో 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గోమాతను జాతీయ జంతువుగా గుర్తించడానికి గల ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ రాధాకృష్ణ పరమాత్మ కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ లలితాదేవి కోలాట, భజన బృందం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి కె.స్వర్ణలత శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను రాధాకృష్ణ మందిర కమిటీ అధ్యక్షుడు మునగాల నాగ వెంకట మురళీకృష్ణ పర్యవేక్షించారు.

శ్రీవారి సేవలో దేవస్థానం మాజీ ఈఓ



ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం మాజీ ఈఓ దంతులూరి పెద్దిరాజు బుధవారం చినవెంకన్నను దర్శించారు. రాష్ట్రంలోని పలువురు డీఆర్వోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం జారీ చేసిన జీవోలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పెద్దిరాజు శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామివారి ఆలయ ఈఓగా నియమితులయ్యారు. దీన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని, ప్రసాదాలను అందుకున్నారు.

హెల్మెట్‌ధారణ తప్పనిసరి



ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ రాజేష్

జంగారెడ్డిగూడెం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించి వాహనాలను నడపాలని సీఐ పి.రాజేష్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో ట్రాఫిక్ ఎస్సై పి.రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధారణ, సురక్షిత ప్రయాణం తదితర అంశాలపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన సీఐ రాజేష్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలలో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఈ ప్రమాదాల్లో ఎక్కువ ప్రాణనష్టం, శారీరిక వైకల్యాలు ఏర్పడుతున్నాయన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వలన ప్రమాద సమయాలలో ప్రాణాపాయం కాకుండా కాపాడుకోగలుగుతారని అన్నారు. జంగారెడ్డిగూడెం రహదారులపై రహదారి ప్రమాదాల నివారణ కొరకు బ్లాక్ స్పాట్లను గుర్తించడం జరిగిందన్నారు. హైవేల నుంచి క్రాస్ రోడ్డు వద్ద ప్రజల అవగాహన నిమిత్తం రబ్బర్ పెయింటింగ్‌లను చేసినట్లు, నిత్యం హైవేలపై వాహన చోదకులకు వాష్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరమన్నారు. పాఠశాల, కళాశాలల్లో రహదారి ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ తరగతుల పోస్టర్ల ఆవిష్కరణ



పీడీఎస్‌యూ తరగతుల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

కొయ్యలగూడెం: తిరుపతిలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో తలపెట్టిన పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక తరగతులకు సంబంధించి బుధవారం పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెంలోని ఎస్టీ హాస్టల్లో విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా సంస్థలను అభివృద్ధి చేయకుండా పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే తరగతుల్లో విద్యారంగ పరిస్థితులపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. జి.ఉదయ్‌కిరణ్, వి.అక్షయ్, జి.భాస్కర్‌రెడ్డి, టి.త్రినాథ్, కె.గౌతమ్, ఎన్.చిన్నారెడ్డి, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

సీపీఐ బహిరంగ సభకు తరలిరండి

కుక్కునూరు: రాష్ట్ర సీపీఐ కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు జాత ముగింపు సందర్భంగా ఈనెల 8వ తేదీన తిరుపతిలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ప్రదర్శన, భారీ బహిరంగ సభకు మండలం నుంచి వేలాదిగా కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి పిలుపునిచ్చారు. బుధవారం కుక్కునూరులో సీపీఐ కార్యాలయంలో బహిరంగ సభ వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, గ్యాస్, నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలను ఇబ్బంది పెడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేటర్లకు కారుచౌకగా కట్టబెట్టేందుకు అత్యుత్సాహం చూపుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వరకా శ్యామల, కూరాకుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూవివాదాలకు చెక్



చింతంపల్లిలో రీసర్వేపై గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: భూవివాదాల శాశ్వత పరిష్కారానికి జగనన్న భూరక్ష పథకంలో భాగంగా చేపట్టిన రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు కోరారు. మండలంలోని చింతంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం రైతులకు మీభూమి – మా హామీ భూముల రీసర్వేపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. దశాబ్దాల కాలంగా భూవివాదాలతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతున్న రైతులు రీ సర్వేతో సమస్యల నుంచి శాశ్వతంగా విముక్తి పొందవచ్చునని తెలిపారు. భూవివాదాల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూరక్ష కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకువచ్చారని తహసీల్దార్ కృష్ణజ్యోతి చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

గొడుగుపేటలో 'పాలవెల్లువ '

ద్వారకాతిరుమల: రామసింగవరం పంచాయతీ, గొడుగుపేట గ్రామంలో జగనన్న పాలవెల్లువ, రుణ మేళా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ద్వారకాతిరుమల డీసీసీబీ బ్రాంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు. జి.కొత్తపల్లి పశువైద్యాధికారి ఎస్ రమేష్ మాట్లాడుతూ రుణం పొందే పాడి రైతులు ఖచ్చితంగా 5 నుంచి 10 మంది గ్రూప్‌గా ఏర్పడాలని, రుణంపై వడ్డీ 12 శాతం కట్టాలని సూచించారు. ఆవుకి రూ.75 వేలు, గేదెకు రూ.90 వేలు ఇస్తారన్నారు. గేదె పాలను అమూల్ కేంద్రానికి మాత్రమే పోయాలన్నారు.

ఎంహెచ్‌ఓపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): నగర పాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగంలో ట్రాక్టర్ క్లీనర్ కె.లోమికి ఆగస్టు నెలలో మూడు రోజులు సెలవును ఏఈ మంజూరు చేసినా ఎంహెచ్‌ఓ అబ్సెంట్‌గా పరిగణించి వేతనం రాకుండా చేయడాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ అనుబంధ దిజోనల్ మున్సిపల్ నాయకులు బుధవారం ఇన్‌చార్జి కమిషనర్ సీహెచ్ బాపిరాజుకు వినతి పత్రం అందజేశారు. ఎంహెచ్‌ఓపై చర్యలు తీసుకోవాలని యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శి ఎ.అప్పలరాజు తదితరులు కోరారు.

8న జగనన్నకు చెబుదాం

పెదవేగి : మండలాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం, శుక్ర వారం కలెక్టర్ స్థాయిలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కలెక్టర్లు నిర్వహించాలని ప్రభుత్వం జి.ఓ సంఖ్య 1775ను జారీ చేసింది. ఈ మేరకు జిల్లా అధికారులు అందరూ ప్రతి బుధవారం, శుక్రవారం ఆయా మండలాల్లో నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్నారు.

8న పెదవేగి మండలంలో జగనన్నకు చెబుదాం

కలెక్టర్ స్థాయిలో మొట్ట మొదటి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని 8వ తేదీ, శుక్రవారం పెదవేగి మండలంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి పెదవేగి మండలంలో నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. పెదవేగి మండలం ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సంబంధిత డివిజన్ల ఆర్డీవో, డీఎల్‌డీవో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ఆయా మండల ప్రత్యేకాధికారి పర్యవేక్షించాలన్నారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే

నిడమర్రు: పెదనిండ్రకొలను పీహెచ్‌సీ పరిధిలోని బువ్వనపల్లిలో మూడు రోజులపాటు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకూ ఈ సర్వే ఇంటింటా జరుగుతుందన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, జాతీయ బీమా కార్యక్రమాలు, జాతీయ, రాష్ట్ర పరిధిలో అందుతున్న ఆరోగ్య పథకాలపై సర్వే సిబ్బంది ప్రజలను వివరాలు అడిగి తెలుసుకుంటారని చెప్పారు. పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. సర్వే సిబ్బందికి సర్పంచ్ కిలారు సత్యవతి అవసరమైన వసతి, సహకారం అందిస్తారని తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పిస్తామన్నారు.

క్షేత్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో 'నీటి' కష్టాలు

- పాడైన మంచినీటి బోరు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు, యాత్రికులు



నిరుపయోగంగా మంచినీటి కుళాయిలు

ద్వారకాతిరుమల: క్షేత్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంచినీటి సమస్య ప్రయాణికులను వేధిస్తోంది. దాదాపు 20 రోజుల క్రితం మంచినీటి బోరు పాడైపోవడంతో నీటి యెద్దడి తలెత్తింది. దీంతో ప్రయాణికులు, భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోజురోజుకు సమస్య జటిలం కావడంతో దేవస్థానం వారు తమ వాటర్ ట్యాంకర్ ద్వారా బస్టాండులోని మరుగుదొడ్లకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఆ నీరు కూడా చాలక ప్రయాణికులు, బస్ డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బస్టాండు సమీపంలోని ఇళ్లకు వెళ్లి, నీటిని తెచ్చుకుని వినియోగిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే శని, ఆదివారాల్లో యాత్రికులు తాగునీటి కోసం పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. వెంటనే ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు, యాత్రికులు కోరుతున్నారు.

రక్తహీనతతో అనారోగ్యం



వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి

గణపవరం: రక్తహీనతతో అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయని, బాలింతలు, యువతులకు రక్తహీనత లేకుండా ఐరన్, ఫోలిక్ మాత్రలు వేసుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. బుధవారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లకు రక్తహీనత, గర్భిణుల ఆరోగ్య వివరాల నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి నెలా గర్భిణుల వివరాల నమోదు, కిశోర బాలికలకు రక్తహీనత లేకుండా మాత్రల పంపిణీ, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం, పీహెచ్‌సీలో ప్రసవాలను ప్రోత్సహించడం, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా బాలింతలను ఇళ్లకు తీసుకెళ్లడం, ఆశ యాప్‌ను ప్రతిరోజూ అప్‌డేట్ చేయడం వంటి పనులన్నీ సక్రమంగా చేయాలన్నారు. నిశ్చయ కిట్టు ద్వారా గర్భ నిర్ధారణ పరీక్షలు చేయడాన్ని వివరించారు. ఆశ నోడల్ అధికారిణి పద్మజ న్యూట్రిషన్ కేర్, గర్భిణి మహిళలకు స్కానింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోలాహలంగా శ్రీకృష్ణ రథోత్సవం



శ్రీకృష్ణ రథోత్సవం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తదితరులు

ఏలూరు (టూటౌన్): అఖిల భారతీయ యాదవ మహాసభ ఏలూరు జిల్లా, నగర యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఏటిగట్టు వద్ద గల యాదవ సంఘం జిల్లా కార్యాలయం వద్ద నుంచి రథయాత్రను రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి ప్రారంభించారు. బాణసంచా పేలుళ్లు, విద్యుత్ దీప కాంతులు, భాజాభజంత్రీలు, తీన్మార్ వాయిద్యాల నడుమ నగర వీధుల్లో అత్యంత కోలాహలంగా రథయాత్ర జరిగింది. శేషతల్పం, శంఖ చక్రాలు, వెనుకా ముందు జంట హంసలతో సువర్ణ రంజిత రథాన్ని పూలతో శోభాయమానంగా అలంకరించారు. శ్రీ కృష్ణ రథయాత్ర ఫైర్‌స్టేషన్ సెంటర్, రామచంద్రరావుపేట, కొత్తపేట, పాతబస్టాండ్ సెంటర్ మీదుగా వన్‌టౌన్‌లోకి ప్రవేశించి తూర్పు వీధి, మెయిన్ బజార్, దక్షిణపు వీధి, పడమర వీధి, జూట్ మిల్లు సెంటర్, ఓవర్ బ్రిడ్జి మీదుగా సాగింది. దారి పొడవునా పెద్ద సంఖ్యలో భక్తులు రథం వద్దకు వచ్చి మంగళహారతులతో కొలిచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, లల్లా గౌరవ అధ్యక్షుడు కిలారపు బుజ్జి, జిల్లా కోశాధికారి గొర్ల రామారావు, రాష్ట్ర యువజన నాయకులు మల్లిపూడి రాజు, ఏలూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల గంగాధర్, ఏలూరు నగర అధ్యక్షుడు బొట్టా అజయ్, నగర కోశాధికారి బోగా రాజేష్, ఉపాధ్యక్షుడు చిట్టిబోయిన సాయిబాబు, నాయకులు కట్టా ఈశ్వరరావు, పెద్దిబోయిన హరనాథ్, చిలకంటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు

గణపవరం: నేత్రదానంపై ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథం కలిగి ఉండాలని, నేత్రదానంలో అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సంతోష్, ఆప్తమాలజీ అధికారి శ్రీనివాస్ అన్నారు. గణపవరం పీహెచ్‌సీలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. మన దేశంలో అంధత్వంతో బాధపడే వారి సంఖ్య బాగా ఎక్కువని, ఇలాంటి వారందరికీ చూపునిచ్చి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించాలంటే ప్రతి ఒక్కరూ తమ మరణానంతరం నేత్రదానం చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారిణి కిరణ్మయి, సీహెచ్‌వో జాలాది విల్సన్ పాల్గొన్నారు.

శ్రీవారి దేవస్థాన దక్షిణ రాజగోపురం ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగర ప్రజలపై శ్రీ వేంకటేశ్వర స్వామి కృపాకటాక్షాలు ఉండాలని నగర పాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు ఆకాంక్షించారు. స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, శేషకుమారి దంపతులు, నగరానికి చెందిన శంకర వెంకట సుబ్బారావు, కిరణ్మయిల ఆర్థిక సహాయంతో స్వామివారి దేవస్థానానికి దక్షిణ రాజగోపురాన్ని రూ.9 లక్షల వ్యయంతో నిర్మించారు. ఈ రాజగోపురాన్ని మంగళవారం పెదబాబు వేద మంత్రాల సాక్షిగా ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు పెదబాబుకు వేదాశీర్వచనం పలికి స్వామి వారి ప్రసాదం అందచేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కత్తిరి రామ్మోహనరావు, 9వ డివిజన్ కార్పొరేటర్ సబ్బన శ్రీనివాసరావు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు, అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పాల్గొనగా కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

12 నుంచి మండలస్థాయి స్కూల్‌గేమ్స్

దెందులూరు: దెందులూరు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఈ నెల 12, 13వ తేదీల్లో కొవ్వలి జెడ్పీ హైస్కూల్లో దెందులూరు మండల విద్యాశాఖాధికారి ఎవీఎస్‌వీ ప్రసాద్, గోపన్నపాలెం హెచ్ఎం డాక్టర్ ఎం.మనోహర్ పర్యవేక్షణలో ఆటల పోటీల ఎంపికలు జరుగుతాయని మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కన్వీనర్ జక్కుల సురేష్ తెలిపారు. బుధవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల, నియోజకవర్గ కార్యవర్గ సమావేశం ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎంట్రీ పాసులు ముందుగానే మండల కోఆర్డినేటర్‌గా అందజేయాలని, మరిన్ని వివరాలకు 9949291754 నంబర్‌లో సంప్రదించాలని ఎంఈఓ అన్నారు. యూనియన్ నాయకులు ఎం.కృష్ణారావు, రాజగోపాల్, సురేష్, రవి, మల్లిఖార్జునరావు తదితరులున్నారు. అనంతరం ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్‌ను సత్కరించారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

గణపవరం: ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. బుధవారం కాశిపాడు, చిలకంపాడులో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు క్షయ, పోలియో, కంఠసర్పి, న్యూమోనియా, ధనుర్వాతం తదితర వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే ఐదేళ్లు వచ్చే వరకూ ప్రతినెలా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తల్లిదండ్రులు ఈ విషయంలో అశ్రద్ధ చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శివకుమారి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.